తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
94949 23460



ఎడిటర్ : రత్నం నాగరాజు
RNI . TELTEL / 2022 / 83463
జాతీయ దిన పత్రిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...
హైదరాబాద్
శనివారం
01 నవంబర్ 2025
సంపుటి 74
సంచిక 3
పేజీలు 8
వెల రూ. 5.00
Epaper : WWW.tharangalu.comEpa
Published From: Hyderabad,Circulated: Hyderabad,Nalgonda,Khammam,Rangareddy,sangareddy,Warangal,Kurnool,Kadapa,Amaravathi,Krishna


## శత్రువుల ఇంట్లోకి చొరబడి మరీ కొడతాం..

### - ప్రధాని మోదీ హెచ్చరిక



- సర్దార్ పటేల్ 150వ జయంతి వేడుకల్లో ప్రధాని మోదీ
- 'ఆపరేషన్ సిందూర్'తో భారత్ శక్తి ఏంటో ప్రపంచానికి తెలిసిందన్న మోదీ
- గత ప్రభుత్వాలు ఓటు బ్యాంకుల కోసం దేశ భద్రతను విస్మరించాయని విమర్శ
- దేశంలో నక్సలిజాన్ని నియంత్రించామని వెల్లడి
- చట్టవిరుద్ధ చొరబాటుదారులందరినీ ఏరివేస్తామని ప్రతిజ్ఞ

వివరాలు 3 లో..



# ఎంతటివారైనా ఉపేక్షించేది లేదు

### నాలాల కబ్జాలను తొలగించాల్సిందే

- భారీ వర్షాలతో జరిగిన పంట ఆస్తి, ప్రాణ నష్టాలపై నివేదికను సమర్పించండి
- వరద ముంపు సమస్యల శాశ్వత పరిష్కారానికి సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలి
- హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో రాష్ట్ర అధికారులు, జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి
- భారీ వర్షాలతో పంటలు, ప్రాణ, ఆస్తి నష్టాలపై రాష్ట్ర అధికారులు, జిల్లాల కలెక్టర్లతో సీఎం సమీక్షా సమావేశం

వరంగల్ ప్రతినిధి, అక్టోబర్ 31, తరంగాలు : నాలాల కబ్జాలను తొలగించాల్సిందే.. ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశపు హాల్ లో భారీ వర్షాలతో జరిగిన పంట, ఆస్తి, ప్రాణ నష్టాలపై ముఖ్యమంత్రి రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి ఎంపీలు, మేయర్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో కలసి రాష్ట్రస్థాయి అధికారులు, జిల్లాల కలెక్టర్లు, జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో భారీ వర్షాలతో జరిగిన పంటలు, ఆస్తి, ప్రాణ నష్టాలపై క్షేత్ర-స్థాయిలో అధికారులతో జిల్లాల కలెక్టర్లు సమీక్ష నిర్వహించి ఆ నివేదికలను ప్రభుత్వానికి త్వరగా అందజేయాలని ఆదేశించారు. భారీ వర్షాలతో జరిగిన పంట,ఆస్తి,ప్రాణ నష్టాలపై జిల్లా కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి నివేదికను అందజేయాలన్నారు. భారీ వర్షాలతో జరిగిన నష్టం పై ఆయా జిల్లాల కలెక్టర్లు స్థానిక ప్రజాప్రతినిధుల సహకారం తీసుకోవాలని సూచించారు. పంట ఆస్తి ప్రాణ నష్టాలపై....

2

## జూబ్లీహిల్స్‌లో కేటీఆర్ రోడ్డు షో..

### - కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం

- హిట్లర్ నశించడం చూశామని, కాంగ్రెస్ ఎప్పటి వరకు ఉంటుందో చూస్తామని వ్యాఖ్య
- జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు దెబ్బపడితే ఈ ప్రభుత్వం ఎక్కువ రోజులు ఉండదన్న కేటీఆర్
- హైడ్రా పేరుతో రేవంత్ రెడ్డి పేదలను రోడ్డుపాలు చేస్తున్నారని ఆరోపణ



తరంగాలు, డెస్క్, అక్టోబర్ 31 : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్టీ అభ్యర్థి మాగంటి సునీత తరపున ఈరోజు రోడ్డు షో నిర్వహించారు. మరో పది రోజుల్లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ఓటింగ్ జరగనున్నందున, ఆయా పార్టీల ప్రచారం ఊపందుకుంది. ఈ క్రమంలో కేటీఆర్ షేక్‌పేట డివిజన్‌లో ప్రచారం చేశారు. ఓయూ కాలనీ మీదుగా వినోభానగర్ వరకు రోడ్డు షో కొనసాగింది.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, హిట్లర్ నశించడాన్ని చూశామని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఎన్నాళ్లు ఉంటుందో చూస్తామని అన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటమి తప్పదని, ఒకవేళ ఓటమి ఎదురైతే ఈ ప్రభుత్వం ఎక్కువ రోజులు నిలబడదని అన్నారు. ఇందిరమ్మ రాజ్యమంటే హైడ్రా పేరుతో నిరుపేదల ఇళ్లు కూల్చడమా అని ప్రశ్నించారు. ఒకప్పుడు ఇందిరమ్మ పేదరికాన్ని నిర్మూలించాలని నినదిస్తే, ఇప్పుడు రేవంత్ రెడ్డి పేదోళ్లను రోడ్డున పడేస్తున్నారని విమర్శించారు.

మాగంటి సునీత మాట్లాడుతూ, జూబ్లీహిల్స్ ఒక కుటుంబమని గోపీనాథ్ చెప్పేవారని గుర్తు చేసుకున్నారు. ఆయన మహిళలకు అండగా ఉంటూ సమస్యలు పరిష్కరించేవారని అన్నారు. కష్ట సమయాల్లో ప్రజలకు అండగా నిలబడ్డారని తెలిపారు. ఎవరికీ భయపడవద్దని, ప్రజలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని ఆమె హామీ ఇచ్చారు.

## హైదరాబాద్‌లో 'డిజిటల్ అరెస్ట్' మోసం..

### - వృద్ధుడిని బెదిరించి రూ.51 లక్షల స్వాహా..!



- రిటైర్డ్ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి నుంచి రూ.51 లక్షల వసూలు
- బాంబు పేలుళ్ల కేసులో ఇరికిస్తామని బెదిరించిన సైబర్ నేరగాళ్లు
- వీడియో కాల్ చేసి బాధితుడిని బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా చేసిన వైనం
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్న పోలీసులు

తరంగాలు, డెస్క్, అక్టోబర్ 31 : హైదరాబాద్ నగరంలో సైబర్ నేరగాళ్లు కొత్త పంథాలో మోసాలకు పాల్పడుతున్నారు. 'డిజిటల్ అరెస్ట్' పేరుతో అమా-యకులను భయభ్రాంతులకు గురిచేసి భారీగా డబ్బులు దండుకుంటున్నారు. తాజాగా శ్రీనగర్ కాలనీకి చెందిన 78 ఏళ్ల రిటైర్డ్ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి వీరి వలలో చిక్కి రూ.51 లక్షలు పోగొట్టుకున్నారు.

**అసలేం జరిగిందంటే..!**

బాధితుడికి కొన్ని రోజుల క్రితం ఒక అపరిచిత నంబర్ నుంచి ఫోన్ కాల్ వచ్చింది. అవతలి వ్యక్తి తాను ముంబై క్రైమ్ బ్రాంచ్ ఏసీపీనని పరిచయం చేసుకున్నాడు. బాధితుడి మొబైల్ సిమ్ కార్డును బాంబు పేలుళ్లు, కిడ్నాప్ కేసుల్లో వాడారని, అతని పేరు మీద ఇతరులు మరి కొన్ని సిమ్ కార్డులు తీసుకున్నారని ....

3

## సీనియర్లకు కీలక పదవులు..

### సుదర్శన్ రెడ్డి, ప్రేమ్‌సాగర్‌కు కేబినెట్ హోదా



- తెలంగాణ సర్కార్ కీలక నియామకాలు
- ప్రభుత్వ సలహాదారుగా బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి
- సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్‌గా మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్

▸ 3

## మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అజారుద్దీన్..

### అల్లా పేరు మీద ప్రమాణం

- రాజ్‌భవన్‌లో అజారుద్దీన్ ప్రమాణం
- ప్రమాణస్వీకారం చేయించిన రాష్ట్ర గవర్నర్
- హాజరైన రేవంత్ రెడ్డి, మంత్రులు



వివరాలు 3 లో..

# ఎంతటివారైనా ఉపేక్షించేది లేదు



## నాలాల కబ్జాలను తొలగించాల్సిందే










మొదటిపేజీ తరువాయి.. నాలాల కబ్జాలను తొలగించాల్సిందే.. ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశపు హాల్ లో భారీ వర్షాలతో జరిగిన పంట, ఆస్తి, ప్రాణ నష్టాలపై ముఖ్యమంత్రి రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి ఎంపీలు, మేయర్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో కలసి రాష్ట్రస్థాయి అధికారులు, జిల్లాల కలెక్టర్లు, జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో భారీ వర్షాలతో జరిగిన పంటలు, ఆస్తి, ప్రాణ నష్టాలపై క్షేత్రస్థాయిలో అధికారులతో జిల్లాల కలెక్టర్లు సమీక్ష నిర్వహించి ఆ నివేదికలను ప్రభుత్వానికి త్వరగా అందజేయాలని ఆదేశించారు. భారీ వర్షాలతో జరిగిన పంట,ఆస్తి,ప్రాణ నష్టాలపై జిల్లా కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి నివేదికను అందజేయాలన్నారు. భారీ వర్షాలతో జరిగిన నష్టం పై ఆయా జిల్లాల కలెక్టర్లు స్థానిక ప్రజాప్రతినిధుల సహకారం తీసుకోవాలని సూచించారు. పంట ఆస్తి ప్రాణ నష్టాలపై నిర్దిష్ట నమూనాలో అంచనా వేసి నివేదికను అందజేయాలన్నారు. తుఫాన్ ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రధానంగా 12 జిల్లాల్లో అధిక నష్టం వాటిల్లిందన్నారు. ఆయా జిల్లాల్లో కలెక్టర్లు క్షేత్రస్థాయిలో తప్పనిసరిగా పర్యటించి జరిగిన నష్టం పై నివేదికలు సిద్ధం చేయాలన్నారు. వివిధ శాఖల మధ్య సమన్వయ లోపం ఉ ఒండొద్దన్నారు. రెవెన్యూ, వ్యవసాయ, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రాణ నష్టం, పంట నష్టం, పశు సంపద, అన్ని శాఖలకు సంబంధించి ఇన్ఫ్రాస్ట్రక్చర్ నష్టానికి సంబంధించి నివేదికలు సమర్పించాలన్నారు. ఇందుకు ప్రజాప్రతినిధుల సహకారం కూడా తీసుకోలన్నారు.ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాలకు సంబంధించి కలెక్టర్లకు రిపోర్ట్ అందజేయాలన్నారు.తుఫాను ప్రభావంతో 12 జిల్లాల్లో తీవ్ర నష్టం జరిగిందని,కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులను .కేంద్రం నుంచి రావాల్సిన నిధులను రాబట్టుకోవడంలో అలసత్వం వద్దని, కేంద్రం నుంచి రాబట్టుకోవాల్సిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం రాబట్టుకుంటుందన్నారు. తాత్కాలిక పరిష్కారం కాకుండా శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. సమన్వయ లోపంతో సమస్యలు పెరుగుతున్నాయని, అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. పది మంది కోసం పదివేలమందికి నష్టం జరుగుతుంటే ఉపేక్షించొద్దన్నారు. దీనిపై అధికారులు స్పష్టమైన నిర్ణయంతో ముందుకు వెళ్లాల్సిందేనని స్పష్టం చేశారు. వరదలు తగ్గిన నేపథ్యంలో శానిటేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని, వరదల్లో ప్రాణ నష్టం జరిగినచోట రూ. 5 లక్షలు పరిహారం ప్రభుత్వం సిద్ధంగా ఉంది.. ఇందుకు సంబధించి వివరాలు సేకరించాలన్నారు. పంటనష్టం, పశు సంపద నష్టపోయిన చోట వారికి పరిహారం అందించాలని, ఇసుక మేటలు పేరుకున్న రైతులను ఆదుకునేందుకు అంచనాలు వేయాలన్నారు.ఇండ్లు మునిగిన వారికి ప్రతీ ఇంటికి రూ.15 వేలు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్దం చేయాలన్నారు.భారీ వర్షాలకు పంట నష్టం జరిగితే ఎకరానికి రూ 10 వేలు, గొర్రెలు, మేకలు చనిపోతే రూ 5 వేలు, బర్రెలు, ఎద్దులకు రూ 50 వేలు నష్ట పరిహారం ఇస్తామన్నారు. ఇండ్లు కోల్పోయి నిరాశ్రయులైన వారిని గుర్తించి వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని,మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.స్మార్ట్ సిటీలో చేయాల్సిన పనులపై ప్రత్యేక నివేదిక తయారు చేయాలని,ఎక్కడా పనులు ఆపే ప్రసక్తి ఉండొద్దన్నారు. క్షేత్రస్థాయిలో ఒక కో-ఆర్డినేషన్ కమిటీ వేసుకుని పనిచేయాలని, వాతావరణ మార్పులతో క్లౌడ్ బరస్ట్ అనేది నిత్యకృత్యమైందని, దీనికి శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు.అధికారులు నిర్లక్ష్యం వదలి, క్షేత్రస్థాయికి వెళ్లాలని ఆదేశించారు.

**రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ..**
భారీ వర్షాలతో జిల్లాల్లో జరిగిన పంట, ఆస్తి, ప్రాణ నష్టాలపై సమగ్ర నివేదికలను వీలైనంత త్వరగా జిల్లాల కలెక్టర్లు అందజేయాలన్నారు. రాష్ట్రంలో ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులున్నా ఆదుకోవాలనేది ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. వరదలతో జరిగిన పంట, ఆస్తి, ప్రాణ నష్టాలపై నిబంధనలను మేరకు నిర్ణీత నమూనాలో వివరాల నివేదికను అందజేయాలని కలెక్టర్లను ఆదేశించారు.

హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ తుఫాను కారణంగా సంభవించిన భారీ వర్షంతో జిల్లాలో జరిగిన పంట, ఆస్తి ప్రాణ నష్టాల గురించి ముఖ్యమంత్రి, మంత్రులకు వివరించారు. జిల్లాలో 229.6ఎంఎం వర్షపాతం కురిసిందని దీంతో వరి పంటతోపాటు పత్తి, మొక్కజొన్న తదితర ప్రధాన పంటలు భారీ వర్షానికి దెబ్బతిన్నాయని తెలియజేశారు. వరదలతో ముగ్గురు మృతి చెందారని, పశు సంపద 10072 నష్టం జరిగిందని, వరి పంట 33 348 ఎకరాలు, పత్తి 750 ఎకరాలు,మోక్కజొన్నా 650 ఎకరాల్లో పంట దెబ్బతిన్నాయని అన్నారు. పలుచోట్ల ఇండ్లకు నష్టం జరిగిందన్నారు. భారీ వర్షం కారణంగా రోడ్లు దెబ్బతిన్నాయన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో నీట మునిగిన ఇండ్లు, విద్యాసంస్థల నుండి ప్రజలు విద్యార్థులను సురక్షితంగా పునరావాస కేంద్రాలు, ఇతర విద్యాసంస్థలకు తరలించినట్లు తెలియజేశారు.

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ..** కురిసిన భారీ వర్షాల వల్ల జిల్లాలో జరిగిన నష్టం గురించి ముఖ్యమంత్రి, మంత్రులకు వివరించారు. పర్వతగిరి, వర్ధన్నపేట మండలాల్లో 378, 318 మిల్లి మీటర్ల వర్షం కురిసింది అని వరంగల్ పట్టణంలోని ఖిలా వరంగల్, వరంగల్ మండలాల్లో 368, 271 మిల్లీమీటర్ల భారీ వర్షం కురిసిందన్నారు.78 ప్రాంతాలు గ్రేటర్ వరంగల్ పరిధిలోని వరంగల్ జిల్లాకు సంబంధించిన 35 ప్రాంతాలు, జలామయమయ్యాయని, 8 పునరావాస కేంద్రాలకు 1170 బాధితులకు తలలించామని జరిగిందన్నారు. జిల్లాలో 58,730 ఎకరాల్లో వరి, 16,420 ఎకరాల్లో పత్తి, 30 ఎకరాల్లో మొక్కజొన్న, 643 ఎకరాల్లో ఉద్యానవన పంటలకు పూర్తిగా నష్టం వాటిలిందని, జిడబ్ల్యూ ఎంసీ ప్రాంతాల్లో నష్టం, జిల్లాలో పంట నష్టం మొత్తం కలిపి 573. 07 కోట్ల రూపాయల నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా వేయడం జరిగిందన్నారు . భారీ వర్షాల వల్ల ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోయారని, 102 గొర్రెలు, 200 లైఫ్ స్టాక్ నష్టం జరిగిందని, ఒక ఇల్లు పూర్తిగా 66 ఇండ్లు పాక్షికంగా నష్టం వాటిలిందన్నారు. 50 ఆర్ అండ్ బి రోడ్లు 10 కాజువేలు 13 పి ఆర్ రోడ్స్ ధ్వంసమయ్యాయని అన్నారు.

జి డబ్ల్యు ఎం సి కమిషనర్ చాహత్ వాజ్పాయ్ గ్రేటర్ వరంగల్ లో భారీ వర్షాలకు జరిగిన నష్టం వివరాలను ముఖ్యమంత్రికి వివరించారు. వరంగల్ నగరంలోని కిలా వరంగల్ వరంగల్ ప్రాంతాల్లో అత్యధిక వర్షపాతం నమోదయినందువల్ల ఇలా మూడు ప్రధాన చెరువుల నుండి వరద నీటితో పాటు సమీపంలో గల తెలుగు రంగంపేట చెరువు వరదనీయుడు చేరుకోవడం వల్ల వరంగల్ మహానగరంలోని 78 కాలనీలు నీట మునిగాయన్నారు 1560 మంది వరద బాధితులకు 45 కేంద్రాలకు సురక్షితంగా తరలించి వారికి నిత్యవసరలను అందించడం జరిగిందన్నారు నగరంలోని ఎనిమిది ట్రాఫిక్ జంక్షన్ లకు అంతరాయం కలిగిందన్నారు. ఈ సందర్భంగా భారీ వర్షాల వల్ల ఖమ్మం, సిద్దిపేట జిల్లాల్లో జరిగిన వివిధ పంటలు, ఆస్తి ప్రాణ నష్టాలు గురించిన ఆ జిల్లాల కలెక్టర్లు అనుదీప్ దురిశెట్టి, హైమావతి ముఖ్యమంత్రికి వివరించారు.

**ఛాయాచిత్ర ప్రదర్శనను పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు**

హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన ఛాయాచిత్రాల ప్రదర్శనను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, ఎంపీలు ఎమ్మెల్యేలతో కలిసి పరిశీలించారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో వరద ముంపు ప్రాంతాల్లో జరిగిన నష్టం, చేపట్టిన సహాయక చర్యలు, పునరావాస కేంద్రాలలో బాధితులకు అందిస్తున్న సహాయం, వరద ప్రాంతాల్లో మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు సందర్శించి సహాయక చర్యలు చేపట్టిన ఫోటోలను ప్రదర్శించగా సీఎం, మంత్రులు పరిశీలించారు.

**అంతకుముందు**
వరంగల్, హన్మకొండ జిల్లాలలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ వ్యూ నిర్వహించిన అనంతరం శుక్రవారం హన్మకొండ ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాల హెలిప్యాడ్ కు చేరుకున్న
రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్,వేం నరేందర్ రెడ్డి లకు మంత్రి కొండా సురేఖ, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, నగర మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు స్నేహ శబరీష్, డాక్టర్ సత్య శారద, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ లు పూల మొక్కలు, బొకేలు అందించి ఘనంగా స్వాగతం పలికారు.

హెలిప్యాడ్ నుండి ముఖ్యమంత్రి సమ్మయ్య నగర్ లో వరద ప్రభావంతో నీట మునిగిన ఇండ్లను పరిశీలించి స్థానికులతో ముఖ్యమంత్రి మాట్లాడారు. జరిగిన నష్టం పై స్థానికులను సీఎం అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని, ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భరోసానిచ్చారు. అక్కడే నాలా వంతెన వద్ద వరదకు దెబ్బతిన్న ప్రాంతాన్ని ముఖ్యమంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా వరదతో జరిగిన నష్టాన్ని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సీఎం రేవంత్ రెడ్డికి వివరించారు. అదేవిధంగా కాపువాడలో వరద ప్రభావం బారీన పడిన బాధిత కుటుంబాలతో ముఖ్యమంత్రి మాట్లాడారు. పోతన నగర్ లో వరద ముంపు బాధితులతో సీఎం ప్రత్యక్షంగా మాట్లాడి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని తెలియజేశారు. సమ్మయ్య నగర్, కాపు వాడ, పోతన నగర్ ప్రాంతాల సందర్శన అనంతరం హనుమకొండ కలెక్టరేట్ కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు చేరుకున్నారు.

హనుమకొండ కలెక్టరేట్ వద్దకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులతో కలిసి చేరుకోగా పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో మాజీ ప్రధాని దివంగత ఇందిరా గాంధీ వర్ధంతి, మాజీ ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి లను పురస్కరించుకొని వారి చిత్రపటాలకు పూలు వేసి నివాళులు అర్పించారు.

ఈ సమీక్షలో రాష్ట్ర పర్యావరణ అటవీ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య శాసనసభ డిప్యూటీ స్పీకర్ డాక్టర్ రామచంద్రు నాయక్, వరంగల్ మహబూబాబాద్ ఎంపీలు డాక్టర్ కడియం కావ్య, పోరిక బలరాం నాయక్, వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్ రెడ్డి, దొంతి మాధవరెడ్డి, కె.ఆర్. నాగరాజు, రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, రాష్ట్ర ఆర్ అండ్ బి శాఖ స్పెషల్ సెక్రటరీ వికాస్ రాజ్, పశు సంవర్ధక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సభ్యసాచి ఘోష్, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రాహుల్ బొజ్జ, సివిల్ సప్లై కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, పురపాలక శాఖ కార్యదర్శి టీకే శ్రీదేవి, వ్యవసాయ శాఖ కమిషనర్ గోపి, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి, ఐజి చంద్రశేఖర్, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, కరీంనగర్, సిరిసిల్ల మహబూబాబాద్, జనగామ జిల్లాల కలెక్టర్లు పమేలా సత్పతి, అద్వైత్ కుమార్ సింగ్, రిజ్వాన్ భాషా షేక్, గరిమా అగ్రవాల్, అదనపు కలెక్టర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమీక్షా సమావేశం అనంతరం హనుమకొండ కలెక్టరేట్ నుండి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానం వద్ద హెలిప్యాడ్ కు చేరుకున్నారు. హెలికాప్టర్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు హైదరాబాద్ కు బయలుదేరి వెళుతుండగా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు వీడ్కోలు పలికారు.










# శత్రువుల ఇంట్లోకి చొరబడి మరీ కొడతాం.. ప్రధాని మోదీ హెచ్చరిక

మొదటిపేజీ తరువాయి..
తరంగాలు, డెస్క్, అక్టోబర్ 31 : శత్రువులకు భారత్ ఇచ్చే సమాధానం ఇప్పుడు చాలా స్పష్టంగా, బలంగా, ప్రపంచానికి కనిపించేలా ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం గుజరాత్‌లోని 'స్టాట్యూ ఆఫ్ యూనిటీ' వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. 'ఆపరేషన్ సిందూర్' ద్వారా శత్రు భూభాగంలోకి ప్రవేశించి మరీ దాడులు చేయగలమని భారత్ నిరూపించిందని ఆయన స్పష్టం చేశా-రు.

"ఎవరైనా భారత్ వైపు కన్నెత్తి చూసే సాహసం చేస్తే, భారత్ వారి ఇంట్లోకి చొరబడి మరీ దెబ్బకొడుతుందని 'ఆపరేషన్ సిందూర్'తో ప్రపంచమంతా చూసింది. ఈ రోజు పాకిస్థాన్‌కు, ఉగ్రవాద నిర్వాహకులకు భారత్ అసలైన శక్తి ఏంటో బాగా తెలుసు" అని ప్రధాని అన్నారు. దేశ భద్రత విషయంలో తమ ప్రభుత్వ దృఢ వైఖరి, సర్దార్ పటేల్ ఆశయాలకు అనుగుణంగానే ఉందని ఆయన పేర్కొన్నారు.

జాతీయ ఐక్యతా దినోత్సవం (రాష్ట్రీయ ఏక్తా దివస్) సందర్భంగా ప్రధాని కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ పార్టీ పటేల్ ఆశయాలను పూర్తిగా మరిచిపోయిందని ఆరోపించారు. కేవలం బాహ్య శత్రువులకే కాకుండా నక్సలిజం, చొరబాట్లు వంటి అంతర్గత సవాళ్లను ఎదుర్కోవడంలో కూడా తమ ప్రభుత్వానికి పటేల్ ఆదర్శాలే మార్గనిర్దేశం చేస్తున్నాయని తెలిపారు.

"2014కు ముందు దేశంలోని అనేక ప్రాంతాల్లో నక్సలైట్లు సమాంతర పాలన సాగించారు. పాఠశాలలు, ఆసుపత్రులను పేల్చివేస్తుంటే, నాటి ప్రభుత్వాలు నిస్సహాయంగా చూశాయి. మేము అర్బన్ నక్సల్స్‌పై కఠినంగా వ్యవహరించాం. దాని ఫలితాలు ఇప్పుడు కనిపిస్తున్నాయి. గతంలో 125 జిల్లాల్లో ఉన్న నక్సల్స్ ప్రభావం ఇప్పుడు కేవలం 11 జిల్లాలకే పరిమితమైంది" అని మోదీ వివరించారు.

చొరబాట్లు దేశ ఐక్యతకు పెను ముప్పుగా పరిణమించాయని ప్రధాని హెచ్చరించారు. "గత ప్రభుత్వాలు ఓటు బ్యాంకుల కోసం దేశ భద్రతను పణంగా పెట్టాయి. దేశం బలహీనపడినా చొరబాటుదారుల కోసం పోరాడేవారు పట్టించుకోరు. కానీ దేశ భద్రత, గుర్తింపు ప్రమాదంలో పడితే ప్రతి పౌరుడూ ప్రమాదంలో పడినట్లే. అందుకే, చట్టవిరుద్ధంగా నివసిస్తున్న ప్రతి చొరబాటుదారుడిని దేశం నుంచి తొలగించాలని మనం సంకల్పించుకోవాలి" అని ఆయన పిలుపునిచ్చారు.

భిన్నత్వంలో ఏకత్వం అనే పటేల్ సందేశాన్ని గుర్తుచేస్తూ ప్రధాని తన ప్రసంగాన్ని ముగించారు. "ఐక్య భారతదేశంలో విభిన్న ఆలోచనలను గౌరవించాలి. అభిప్రాయ భేదాలు ఉండొచ్చు, కానీ హృదయాల్లో భేదాలు ఉండకూడదు" అని ఆయన అన్నారు. అంతకుముందు, ప్రధాని మోదీ 182 మీటర్ల ఎత్తైన పటేల్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి, హాజరైన వారితో ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేయించారు. 2014 నుంచి ప్రతి ఏటా అక్టోబర్ 31న సర్దార్ పటేల్ జయంతిని జాతీయ ఐక్యతా దినోత్సవంగా జరుపుకుంటున్న విషయం తెలిసిందే.

# సీనియర్లకు కీలక పదవులు..

## సుదర్శన్ రెడ్డి, ప్రేమ్‌సాగర్‌కు కేబినెట్ హోదా

మొదటిపేజీ తరువాయి..
తరంగాలు, డెస్క్, అక్టోబర్ 31 : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలనాపరంగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. పార్టీలోని ఇద్దరు సీనియర్ ఎమ్మెల్యేలకు కేబినెట్ హోదాతో కూడిన ముఖ్యమైన పదవులను కేటాయించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్. రామకృష్ణారావు అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు.

వివరాల్లోకి వెళితే, బోధన్ ఎమ్మెల్యే పి. సుదర్శన్ రెడ్డిని ప్రభుత్వ సలహాదారు (గవర్నమెంట్ అడ్వైజర్)గా నియమించారు. అదేవిధంగా, మంచిర్యాల ఎమ్మెల్యే కె. ప్రేమ్‌సాగర్ రావుకు తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ (సివిల్ సప్లైస్ కార్పొరేషన్) ఛైర్మన్‌గా బాధ్యతలు అప్పగించారు. ఈ రెండు పదవులకు కేబినెట్ హోదా కల్పించడం గమనార్హం.

కొంతకాలంగా మంత్రివర్గంలో చోటు కోసం ఈ ఇద్దరు సీనియర్ నేతలు ఎదురుచూస్తున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో, వారిని సంతృప్తిపరిచేందుకే అధిష్ఠానం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. వారి అనుభవాన్ని ప్రభుత్వానికి ఉపయోగించుకోవడంతో పాటు, పార్టీలో వారికి సముచిత స్థానం కల్పించాలనే ఉద్దేశంతో ఈ నియామకాలు చేపట్టినట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. తాజా ఉత్తర్వులతో ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వచ్చినట్లయింది.

# మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అజారుద్దీన్..

## అల్లా పేరు మీద ప్రమాణం

మొదటిపేజీ తరువాయి..
తరంగాలు, డెస్క్, అక్టోబర్ 31 : భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, కాంగ్రెస్ సీనియర్ నేత మహమ్మద్ అజారుద్దీన్ తెలంగాణ రాష్ట్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లోని దర్బార్ హాలులో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆయనతో మంత్రిగా ప్రమాణస్వీకారం చేయించారు. అల్లా పేరు మీద అజారుద్దీన్ ప్రమాణం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో ఈ కార్యక్రమం నిరాడంబరంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డితో పాటు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజ-రయ్యారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఇతర కేబినెట్ సహచరులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ జితేందర్ తదితరులు పాల్గొన్నారు. ప్రమాణస్వీకారం పూర్తయిన అనంతరం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు, నేతలు అజారుద్దీన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. సరిగ్గా మధ్యాహ్నం 12:25 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమం కేవలం 9 నిమిషాల్లోనే ముగియడం గమనార్హం. మరోవైపు, అజారుద్దీన్ కు ఏ శాఖ కేటాయిస్తారనే విషయం ఆసక్తిని రేకెత్తిస్తోంది.

# హైదరాబాద్‌లో 'డిజిటల్ అరెస్ట్' మోసం..

## - వృద్ధుడిని బెదిరించి రూ.51 లక్షల స్వాహా..!

మొదటిపేజీ తరువాయి..
నమ్మబలికాడు. అంతేకాకుండా మనీ లాండరింగ్ ఆరోపణలు ఉన్నాయంటూ సీబీఐ పేరుతో ఉన్న నకిలీ నోటీసులను కూడా చూపించి తీవ్రంగా బెదిరించాడు.

ఆ తర్వాత బాధితుడిని వీడియో కాల్ ద్వారా 'డిజిటల్ అరెస్ట్' చేశారు. ఎవరితోనూ మాట్లాడకుండా, బయటకు వెళ్లకుండా కట్టడి చేశారు. కేసు నుంచి బయటపడాలంటే బ్యాంకు ఖాతాలో ఉన్న డబ్బులో 95 శాతం బదిలీ చేయాలని, విచారణ పూర్తయ్యాక ఆ మొత్తాన్ని తిరిగి ఇచ్చేస్తామని నమ్మించారు. తీవ్ర భయాందోళనలకు గురైన బాధితుడు, వారు చెప్పిన ఖాతాలకు రూ.51 లక్షలు బదిలీ చేశాడు. కొద్దిసేపటి తర్వాత మోసపోయానని గ్రహించి సైబర్‌క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

నగరంలో ఈ వారంలో ఇలాంటి తరహాలో జరిగిన రెండో భారీ మోసం ఇది. కొన్ని రోజుల క్రితమే, 73 ఏళ్ల వృద్ధురాలిని సైబర్ నేరగాళ్లు ఇదే పద్ధతిలో రూ.1.43 కోట్లు మోసం చేశారు. చైల్డ్ ట్రాఫికింగ్, హత్య కేసుల్లో నిందితుడి వద్ద ఆమె ఆధార్ కార్డు దొరికిందని, అరెస్ట్ చేస్తామని బెదిరించి డబ్బులు కాజేశారు.

ఇటీవల హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ఫొటోను వాట్సాప్ డీపీగా పెట్టుకుని కొందరు డబ్బులు వసూలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, అలాంటి వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. అపరిచిత వ్యక్తులు అధికారులుగా చెప్పుకుని ఫోన్లు చేస్తే నమ్మవద్దని, వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అధికారులు కోరుతున్నారు.

# ఖమ్మంలో దారుణం.. సీపీఎం నేత దారుణ హత్య



తరంగాలు, డెస్క్, అక్టోబర్ 31
ఖమ్మం జిల్లాలో దారుణ ఘటన చోటుచేసుకుంది. సీపీఎం రైతు సంఘం నేత సామినేని రామారావును గుర్తుతెలియని దుండగులు అత్యంత పాశవికంగా హత్య చేశారు. చింతకాని మండలం పాతర్లపాడు గ్రామంలో శుక్రవారం ఉదయం ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపింది.

వివరాల్లోకి వెళ్తే.. సామినేని రామారావు రోజూ మాదిరిగానే ఈరోజు ఉదయం వాకింగ్‌కు వెళ్లారు. ఆ సమయంలో మార్గమధ్యంలో ఆయన్ను అడ్డగించిన దుండగులు, పదునైన ఆయుధంతో గొంతుకోసి హతమార్చారు. రక్తపు మడుగులో పడివున్న ఆయన్ను గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.

సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిసరాలను పరిశీలించి, సాక్ష్యాధారాలను సేకరించే పనిలో పడ్డారు. హత్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. ఈ హత్య వెనుక రాజకీయ లేదా వ్యక్తిగత కక్షలు ఏమైనా ఉన్నాయా? అనే కోణంలో దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనతో పాతర్లపాడు గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# సర్దార్ వల్లభాయ్ పటేల్ చూపిన మార్గంలో యువతీ,యువకులు ముందుకు సాగాలి

- ❖ జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్
- ❖ సర్దార్ వల్లభాయ్ పటేల్ ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయుడు, ఐక్యమత్యంతో ఏదైనా సాధ్యం అవుతుంది
- ❖ జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్
- ❖ రన్ ఫర్ యూనిటీ 2కె,25, కార్యక్రమంలో యువతీ, యువకులతో ఉత్సాహంగా పాల్గొన్న జిల్లా కలెక్టర్, ఎస్పీలు,









మహబూబాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 31, తరంగాలు : సర్దార్ వల్లభాయ్ పటేల్ 150,వ జయంతి పుర-స్కరించుకుని మహబూబాబాద్ పోలీస్, ఆధ్వర్యంలో నిర్వహించిన రన్ ఫర్ యూనిటీ, 2కె రన్ ను జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో, లు జెండా ఊపి రన్ ప్రారంభించారు. నెహ్రూ సెంటర్, జనరల్ హాస్పిటల్, ఎన్టీఆర్ స్టేడియం వరకు కొనసాగిన ఈ రన్ లో జిల్లా కలెక్టర్, ఎస్పీ, అదనపు కలెక్టర్, డీఎస్పీలు, పోలీస్ యంత్రాంగం, రెసిడెన్షియల్ పా-ఠశాలల విద్యార్థిని, విద్యార్థులు, స్థానిక యువతీ, యువకులు, వాకర్స్, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఎన్టీఆర్ స్టేడియం వరకు కొనసాగి ర్యాలీలో పాల్గొన్న వారితో కలిసి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ గారు పటేల్ చూపిన మార్గంలో యువతి, యువకులు, ప్రతి ఒక్కరూ ఐక్యతగా ఉండి ప్రయాణిస్తే మెరుగైన సమాజం నిర్మాణం కోసం మరింత కృషి చేసినట్లు అవుతుందని ఆయన ఐడియాలజీ, యూనిటీని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తులో ముందుకు సాగాలని సూచించారు. జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ మాట్లాడుతూ ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయి పటేల్ జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శం అని మెరుగైన సమాజం కోసం ఆయన చూపిన మార్గాన్ని ఐకమత్యంతో అనుసరించాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా అమర వీరుల సంస్కరణ వారోత్సవాలు వివిధ కార్యక్రమాల ద్వారా జరుపుకొని వారి యొక్క త్యాగాలను గుర్తుకు చేసుకున్నామని, సర్దార్ వల్లభాయ్ పటేల్ ఐడియాలజీ ప్రకారం జిల్లాలో ఎలాంటి విపత్కర పరిస్థితిలోనైనా ధైర్యంగా జిల్లా కలెక్టర్ యంత్రాంగం ఎదుర్కొని సమస్యలను అధిగమించి ప్రజలకు సేవలు అందించడం జరుగుతుందని, అందులో భాగంగానే గతంలో వరదలు వచ్చిన సమయంలో యూరియా పంపిణీలో చేసిన కృషి జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఆధ్వర్యంలో పోలీసు యంత్రాంగం జిల్లా యంత్రాంగం పకడ్బందీ ప్రణాళికతో రైతులకు ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవడం జరిగిందని భవిష్యత్తులో కూడా ఇలా ముందుకు వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నామని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు తిరుపతిరావు, శ్రీనివాసరావు, విజయ ప్రతాప్, మోహన్, సిఐలు మహేందర్ రెడ్డి, సర్వయ్య, తదితరులు పాల్గొన్నారు.

# యువతి గల్లంతైన బొల్ల మత్తడిని సందర్శించిన ఎమ్మెల్యే కడియం

## - యువతి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని భరోసా ఇచ్చిన ఎమ్మెల్యే కడియం

జఫర్గడ్ ప్రతినిధి, అక్టోబర్ 31,(తరంగాలు) : మండలంలోని ఏబి తండా సమీపంలోని బొల్ల మత్తడి వద్ద రెండు రోజుల క్రితం యువతి గల్లంతైనా ప్రదేశాన్ని ఎమ్మెల్యే కడియం శ్రీహరి సందర్శించారు. వరద ఉధృతిని స్థానిక నాయకులను, అధికారులను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్ లో ఇలాంటి సంఘటనలు జరగకుండా బొల్ల మత్తడి వద్ద మరమ్మత్తులు చేయాలని అధికారులకు సూచించారు. గల్లంతైనా యువతి మృతదేహన్ని ఈ రోజు ఉదయం గుర్తించినట్లు, పోస్టుమార్టం నిమిత్తం జనగామ అస్పత్రికి తరలించినట్లు స్థానిక ఎస్సై ఎమ్మెల్యే కి తెలిపారు. అనంతరం అక్కడే ఉన్న యువతి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కడియం శ్రీహరి పరామర్శించారు. ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. యువతి మృతి కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేయడంతో పూర్తి స్థాయిలో సమగ్ర విచారణ జరపాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. పోస్టుమార్టం నివేదిక రాగానే సమగ్ర విచారణ చేసి న్యాయం చేస్తామని బాధిత కుటుంబానికి హామీ ఇచ్చారు. వీలైనంత తొందరగా డిజాస్టర్ మేనేజ్ మెంట్ ద్వారా 5లక్షల ఆర్థిక సహాయం అందే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక తహసీల్దార్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ మార్కెట్ వైస్ చైర్మన్ ఐలయ్య, అధ్యక్షులు మంచాల ఎల్లయ్య, మాజీ ఎంపీపీ సుదర్శన్,కుల్ల మోహన్ రావు, ఇల్లందుల శ్రీనివాస్, రాజేష్ నాయక్, సుధాకర్ బాబు, రమేష్ గౌడ్, మార్కెట్ డైరెక్ట్ సురేష్, మొగిలి, యస్ ఐ, రామారావు,వివిధ శాఖల అధికారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# కోతుల బారి నుండి రక్షణ కోసం భోజనశాలకు మెష్ దాతృత్వం చాటుకున్న ఉపాధ్యాయులు

జఫర్గఢ్ ప్రతినిధి, అక్టోబర్ 31,(తరంగాలు) : మండలం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హిమ్మత్ నగర్ ఉపాధ్యాయులు మరోసారి దాతృత్వం చాటుకున్నారు. గతంలో విద్యార్థులకు శుద్ధమైన మినరల్ వాటర్ అందించాలనే ఉద్దేశ్యంతో 30000 విలువైన వాటర్ ప్యూరిఫయర్ అందించగా ఇప్పుడు పాఠశాలలో మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా నిర్మించిన భోజనశాల కిటికీలు వెంటిలేటర్లకు ఐరన్ మెష్ తో ఫెన్సింగ్ వెల్డింగ్ చేయించారు. విద్యార్థులు భోజనాలు చేస్తుంటే కిటికీ గ్రిల్స్ నుండి కోతులు లోపలికి ప్రవేశించి నానా భీభత్సం సృష్టించేవి అంతేకాకుండా పాఠశాలకు సెలవులు వస్తే భోజనశాల లోపలే తిష్ట వేసి మల మూత్రాదులతో అపరిశుభ్రంగా చేసేవి. ఈ బెడద నుండి తప్పించేందుకు పాఠశాలలో గత విద్యా సంవత్సరం నూతనంగా పదోన్నతులు బదిలీలపై వచ్చిన ఉపాధ్యాయులు.అప్పటికే పని చేస్తున్న ఉపాధ్యాయులు అంతా కలిసి 21000, ఖర్చు భరించి ప్రధానోపాధ్యాయుల కార్యాలయ గదికి, కంప్యూటర్ గదికి, స్టాఫ్ రూమ్ కు కూడా ఇదే రకంగా ఐరన్ మెష్ తో ఫెన్సింగ్ జాలీని వెల్డింగ్ చేయించారు. ఈ సందర్భంగా పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు మంగు జయప్రకాశ్ మాట్లాడుతూ మా పాఠశాల ఉపాధ్యాయులు కేవలం విద్యార్థుల విద్యాభివృద్ధికి మాత్రమే కాకుండా పాఠశాల మౌలిక సదు-పాయాల కల్పన కోసం కూడా తాము స్వయంగా ఖర్చులు భరిస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలోనే ఒక వాష్ రూమ్, వాటర్ ప్యూరిఫయర్, ప్రస్తుతం స్టాఫ్ రూమ్, కంప్యూటర్ రూమ్,భోజనశాల కిటికీలు వెంటిలేటర్లకు ఐరన్ మెష్ జాలీ వెల్డింగ్ చేయించి కోతుల నుండి రక్షణ కల్పించారని వివరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సేవలను గ్రామ మాజీ సర్పంచ్ తాటికాయల అశోక్,మాజీ ఎంపీటీసీ సభ్యులు యార నీలమ్మ సోమిరెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ శ్రీమతి రాపర్తి రమ కొనియాడారు.





ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పసునూరి కవిత, కడారి వసంత, గాదె వెంకట స్వామి, వెంగల జితేందర్, దామెర ఉపేందర్, మోదుగు వనజాత, పొరిక మంజుల, భూక్యా వంశీకృష్ణ, దీకొండ మాధవి, ఆఫీస్ సబార్డినేట్ మామూనూరి ప్రశాంత, తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## - మహబూబాబాద్ ఎమ్మెల్యే డా. మురళీ నాయక్ ..





కేసముద్రం, మహబూబాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 31, తరంగాలు: మొంథ తుఫాన్ ప్రభావంతో శుక్రవారం కేసముద్రం మండలం వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వర్షాల తీవ్రతతో పలు ప్రాంతాల్లో నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేసముద్రం మండల కేంద్రం నుండి గూడూరు మండలం వైపుకు వెళ్లే ప్రధాన రహదారిపై వర్షపు నీరు పొంగి రహదారిపైకి ప్రవహించడం వల్ల వాహన రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ పరిస్థితి గురించి సమాచారం అందుకున్న మహబూబాబాద్ శాసనసభ్యులు డా. భూక్యా మురళీ నాయక్,వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడి పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించి, ప్రజల భద్రత దృష్ట్యా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రహదారిపై నీరు తగ్గే వరకు ఆ మార్గంలో ప్రయాణం చేయకూడదని ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా మురళీ నాయక్ మాట్లాడుతూ.. ప్రజల ప్రాణభద్రత మనకు అత్యంత ముఖ్యమైనది. అధికారులు నిరంతరం అందుబాటులో ఉండి ప్రజల భద్రత కోసం ముందస్తు చర్యలు తీసుకోవాలి. ఎక్కడైనా నీరు ఎక్కువగా నిలిచిపోతే వెంటనే బారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలను నిలిపివేయాలి. ఎవరూ అవసరం లేకుండా బయటకు రావద్దు. వర్షాలు కొనసాగుతున్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి అని సూచించారు. అలాగే భారీ వర్షాల కారణంగా గ్రామాల్లో మౌలిక సదుపాయాలు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యుత్ శాఖ, పంచాయతీ, రోడ్డు & భవనాల శాఖలు సమన్వయంతో పని చేయాలని వారు సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వర్షపు నీరు ధాన్య కొనుగోలు కేంద్రాల్లోకి చేరకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఎక్కడైనా అత్యవసర పరిస్థితులు ఉంటే అధికారులు, ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందిస్తారు. ప్రభుత్వం ప్రజల పక్షాన ఉంది అని ఎమ్మెల్యే డా. మురళీ నాయక్,తెలిపారు. తన పర్యటనలో ఎమ్మెల్యే గారితో పాటు కేసముద్రం మండల తహసీల్దార్, ఎంపీడీఓ, ఇంజనీరింగ్ శాఖ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రజలు ఎమ్మెల్యే తక్షణ స్పందనకు కృతజ్ఞతలు తెలుపుతూ, వర్షాల మధ్యలో స్వ-యంగా గ్రామానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించడం పట్ల అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు అంబటి మహేందర్ రెడ్డి, మండల అధ్యక్షులు అల్లం నాగేశ్వరరావు, ఆర్టీవో నెంబర్ రావుల మురళీ,మాజీ పీసీసీ సభ్యులు దాస్రు నాయక్, జిల్లా కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు అజ్మీర సురేష్ నాయక్, గ్రామ నాయకులు, డైరెక్టర్లు,మండల నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎంబీబీఎస్ సీటు సాధించిన దళిత విద్యార్థికి 50 వేల ఆర్థిక సహాయం

## - పేద విద్యార్థికి అండగా ఎఎంసి చైర్మన్ అనుమాండ్ల తిరుపతిరెడ్డి

తొర్రూర్ అక్టోబర్ 31 తరంగాలు మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని చర్లపాలెం గ్రామానికి చెందిన నిరుపేద దళిత విద్యార్థి ధర్మారపు లోకేష్ నీట్ పరీక్షలో ప్రతిభ కనబర్చి మంచిర్యాల మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించాడు. ఈ సందర్భంగా లోకేష్ చదువుకు ఆర్థికంగా ఇబ్బందిలో ఉన్నాడని తెలుసుకొని వారికి అండగా నిలుస్తూ తొర్రూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతిరెడ్డి ముందుకు వచ్చారు. శుక్రవారం తొర్రూరు పట్టణ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో మొదటి సంవత్సరం ఫీజుగా రూ. 50 వేల చెక్కును లోకేష్ తండ్రి యాకయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ... పేద దళిత కుటుంబానికి చెందిన లోకేష్ కృషితో ఎంబీబీఎస్ సీటు సాధించడం ప్రశంసనీయమైన విషయం, ఆయన విద్యాభ్యాసం కోసం మొత్తం ఐదు సంవత్సరాల పాటు రూ. 2.50 లక్షలు



'అనుమాండ్ల మాధవరెడ్డి మెమోరియల్ ట్రస్ట్' తరఫున అందజేస్తాము అని తిరుపతి రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో చర్లపాలెం గ్రామ నాయకులు, ప్రజాప్రతినిధులు, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

# గుంతలు పడిన రోడ్డుపై మొరం పోయించిన మిల్లుయజమాని

జఫర్గడ్ ప్రతినిధి, అక్టోబర్ 31,(తరంగాలు): మండల కేంద్రం నుండి ఓబ్లాపూర్ –తమ్మడపల్లి –జీ వెళ్ళే ప్రధాన రహదారిలో పెద్ద గుంత ఏర్పడడంతో స్థానిక రైస్ మిల్లు యజమాని గందె సీతారాములు అండ్ సన్స్ మొరం పోయించారు. రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు దివిటిపల్లి క్రాస్ నుండి ఓబ్లాపూర్ –తమ్మడపల్లి–జీ ప్రధాన రహదారిలో పెద్ద గుంత ఏర్పడి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇది గమనించిన స్థానిక మిల్లు యజమాని ట్రాక్టర్ మొరం తెప్పించి గుంతను పూడ్చివేయించారు. మిల్లు యజమాని చేసిన పనికి పలువురు అభినందనలు తెలిపారు.





# సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆలోచనలతో ముందుకు సాగాలి

## - తొర్రూరు డి.ఎస్.పి కృష్ణకిషోర్




తొర్రూరు అక్టోబర్ 31 తరంగాలు... ఉక్కుమనిషి సర్దార్ వల్లబాయి పటేల్ 150 వ జయంతిని పురస్కరించుకొని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ ఆదేశాల మేరకు పోలిసుల ఆధ్వర్యంలో తొర్రూరు పట్టణంలో ఐక్యత 2 కె రన్ ను జెండా ఊపి ప్రారంభించిన తొర్రూరు డి.ఎస్.పి కృష్ణకిషోర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర నుండి ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వరకు కొనసాగింది. ఈ ఐక్య 2కే రన్ లో తొర్రూరు మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్, సిఐ గణేష్, తొర్రూర్ ఎస్సై ఉపేందర్, మరియు పెద్ద వంగర, దంతాలపల్లి, నెల్లికుదురు, నరసింహుల పేట, మరిపెడ ఎస్సైలు, మరియు పోలీస్ సిబ్బంది వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. డీఎస్పీ కృష్ణ కిషోర్ మాట్లాడుతూ ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశ హోం శాఖ మంత్రిగా పనిచేసిన రోజులలో ఆయన సేవలు గుర్తించుకొని దేశ ఐక్యత సమగ్రతకు గుర్తుగా ఈరోజు 150వ జయంతి సందర్భంగా ఈ ఐక్యత 2కె రన్ జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు. ఆయన స్ఫూర్తితో దేశ భవిష్యత్తులో విద్యార్థులె ఎంతో కీలకమని నేటి విద్యార్థులే రేపటి దేశ భావితరాలకు ఉన్నత పౌరులుగా ఎదగాలని సూచించారు.

# పాలేరు జలాశయానికి కొనసాగుతున్న వరద

- ❖ పరివాహక ప్రాంతాల నుంచి చేరుతున్న 42,955 క్యూసెక్కులనీరు
- ❖ 25.20 అడుగులు వద్ద నిలకడగా నీటిమట్టం
- ❖ ఊపిరి పీల్చుకున్న అధికారయంత్రాంగం



పాలేరు ఆర్సీ, 31 అక్టోబర్ (తరంగాలు) : పాలేరు జలాశయానికి వరద కొనసాగుతోంది. మొంథా తుఫాను కారణంగా ఎగువ వరంగల్, మహబూబాబాద్ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున వస్తున్న వరద కారణంగా పాలేరు జలాశయం ఉగ్రరూపం దాల్చింది. గురువారం సాయంత్రానికి 48 వేల క్యూసెక్కుల వరద నమోదు కాగా, శుక్రవారం ఉదయం స్వల్పంగా 43 వేలకు తగ్గింది. 25.70 అడుగులు ఉన్న నీటి మట్టం 25.20 అడుగులకు తగ్గింది. శుక్రవారం సాయంత్రానికి ప్రవాహం నిలకడగా ఉండడంతో, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

# ఘనంగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి



పాలేరు ఆర్సీ, 31 అక్టోబర్, (తరంగాలు) : గరీభీ హఠావో, రాజాభరణాల రద్దు, బ్యాంకుల జాతీయం వంటి సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుని దేశం ఉన్నతికోసం పాటుపడిన ధైర్యవంతమైన మహిళా నాయకురాలు ఇందిరాగాంధీ అని మంత్రి పొంగులేటి కూసుమంచి క్యాంపు కార్యాలయం ఇన్ చార్జ్ భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం ఇందిరాగాంధీ జయంతి పురస్కరించుకుని మంత్రి క్యాంపు కార్యాలయం, మినీ గాంధీ భవనంలలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పార్టీ నాయకులు, కార్యకర్తల హర్షధ్వానాల నడుమ పూలమాల వేసి ఘననివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతావని ముద్దు బిడ్డ ఇందిరాగాంధీ అన్నారు. దేశ ప్రధానమంత్రిగా ఎన్నో నూతన ఆవిష్కరణలకు నాంది పలికారని కొనియాడారు. ఆమె స్ఫూర్తితోనే నేడు రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యంగా చెప్పబడుతున్న ప్రజాపాలన నడుస్తుందన్నారు. అంతటి గొప్పనాయకురాలు పేరుతో నేడు పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికోసం ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో క్యాంపు కార్యాలయం ఇంచార్జి బీమిరెడ్డి శ్రీనివాస రెడ్డి, సీడీసీ చైర్మన్ వై సూర్యనారాయణరెడ్డి, సీనియర్ నాయకులు మహమ్మద్ హఫీజుద్దీన్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రావ్య మృతదేహాన్ని గుర్తించిన ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది, పోలీసులు



జఫర్గఢ్ ప్రతినిధి, అక్టోబర్ 31, (తరంగాలు) : మండలంలోని శంకర్ తండా సమీపంలో బైక్ పై వెళ్తున్న ప్రేమజంట వాగు ఉద్ధృతికి కొట్టుకుపోయారు. చెట్టుకొమ్మ సాయంతో యువకుడు శివకుమార్ బయటపడగా యువతి శ్రావ్య ఆచూకీ లభించలేదు. ఆమె కోసం ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది, పోలీసులు పడవల సాయంతో గాలింపు చేపట్టారు. శుక్రవారం రోజున శంకర్ తండా సమీపంలోని కుంటలో ఆమె మృతదేహాన్ని గుర్తించారు.

# మాజీ ఎమ్మెల్యే రాజయ్య ను మర్యాదపూర్వకంగా కలిసిన బి ఆర్ఎస్వి నియోజకవర్గ ఇన్చార్జ్ గోలి నిరంజన్ రెడ్డి



జఫర్గడ్ ప్రతినిధి,అక్టోబర్ 31, (తరంగాలు): మండలంలోని ఉప్పుగల్లు గ్రామానికి చెందిన గోలి నిరంజన్ రెడ్డికి తనపై నమ్మకం తో స్టేషన్ఘన్పూర్ బి ఆర్ఎస్వి నియోజకవర్గ ఇన్చార్జిగా నియమించిన సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యను మర్యాదపూర్వకంగా కలిసి చాలువతో సన్మానించినారు. అనంతరం వారు మాట్లాడుతూ తనకు ఇచ్చిన పదవిని కాపాడుకుంటూ అందరితో కలిసి మెలిసి పనిచేస్తానని అన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన వర్ధన్నపేట ఎస్సై సాయిబాబు



వర్ధన్నపేట ప్రతినిధి,అక్టోబర్ 31,తరంగాలు : వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని లక్ష్మీ గార్డెన్ లో జరిగిన బండి పద్మకుమారస్వామి దంపతుల పెద్ద కుమార్తె సౌమ్య-వరుణ్ గౌడ్ ల వివాహ వేడుకలో వర్ధన్నపేట ఎస్ఐ సాయిబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో తాళ్లపల్లి యాదగిరి గౌడ్, బూర అశోక్ గౌడ్, పోలీస్ సిబ్బంది దామోదర్, విజయ సాగర్, శ్రీకాంత్ ,రంజిత్, అజయ్, శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

# వాగ్దేవి కాలేజీలో విజయవంతంగా ముగిసిన అంతర్జాతీయ సదస్సు




వరంగల్ ప్రతినిధి, అక్టోబర్ 31, తరంగాలు వరంగల్ జిల్లా బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజీలో రెండు రోజులపాటు జరిగిన ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ రీసెంట్ ట్రెండ్స్ ఇన్ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటింగ్ టెక్నాలజీ విజయవంతంగా ముగిసిందని సదస్సు నిర్వాహకులు, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సయ్యద్ ముస్తాక్ అహమ్మద్ తెలిపారు. ఈ సదస్సులో దేశ విదేశాల నుండి వచ్చిన పరిశోధకులు 256 పరిశోధన పత్రాలను సమర్పించారు.వానిజ్య, వ్యవసాయ రంగాల్లో కృత్రిమ మేధస్సు వినియోగం కాలుష్య రహిత స్మార్ట్ సిటీస్ సెన్సార్లెస్ వెహికిల్ కంట్రోల్ వంటి పరిశోధన పత్రాలు విశేష ఆకర్షణగా నిలిచాయి.ఈ పత్రాలు భవిష్యత్తు సాంకేతిక అభివృద్ధికి దారితీయగలవని నిపుణులు అభిప్రాయపడ్డారు.ముగింపు సమావేశంలో వాగ్దేవి విద్యాసంస్థల జాయింట్ సెక్రటరీ వాణిదేవి మాట్లాడుతూ విద్య, వ్యవసాయ, వాణిజ్య రంగాల్లో కృత్రిమ మేధస్సు ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు, అధ్యాపకులు నూతన ఆవిష్కరణల్లో చురుకైన పాత్ర వహించాలని ఆమె సూచించారు. ఇలాంటి సదస్సులు ప్రతీ సంవత్సరం నిర్వహించేలా అధ్యాపకులను ప్రోత్సహించారు.సదస్సు ముగింపు కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సయ్యద్ ముస్తాక్ అహమ్మద్, విభాగాధిపతులు, అధ్యాపకులు మరియు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మహబూబాబాద్ శాసనసభ్యులు డా భూక్యా మురళీ నాయక్

❖ **గరీబుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన పేరు ఇందిరమ్మ... ఎమ్మెల్యే డా మురళీ నాయక్**





కేసముద్రం, మహబూబాబాద్, ప్రతినిధి,అక్టోబర్.31, తరంగాలు: కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని వ్యవసాయ మార్కెట్ నందు ఇండియా (సీసీఐ ) ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మహబూబా బాద్ శాసనసభ్యులు డా భూక్యా మురళీ నాయక్,అనంతరం పేదరిక నిర్మూలన, సామాజిక సమానత్వం కోసం జీవితాన్ని అంకితం చేసిన భారతదేశ మహానాయిక ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలతో నివాళులు అర్పించిన ఎమ్మెల్యే డా మురళీ నాయక్, ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా.మురళీ నాయక్ మాట్లాడుతూ.. .పత్తి రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని సీసీఐ ఆధ్వర్యం లో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించామ న్నారు. రైతులకు కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) ను కల్పించాలని సీసీఐ అధికారులను ఎమ్మెల్యే కోరారు. దళారులను నమ్మవద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు.ఈ కొనుగోలు కేంద్రం ద్వారా పత్తి రైతులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. పత్తి రైతులు కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) కోసం 'కపాస్ కిసాన్ 'మొబైల్ యాప్ ను డౌన్ లోన్ చేసుకోవాలని సీసీఐ అధికారులు కోరారు. పత్తి రైతుల ప్రయోజనాల ను కాపాడాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు అంబటి మహేందర్ రెడ్డి, మండల అధ్యక్షులు అల్లం నాగేశ్వరరావు,ఆర్టీవో మెంబర్ రావుల మురళీ మాజీ పీసీసీ సభ్యులు దాస్రు నాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా యూత్ అధ్యక్షులు అజ్మీర సురేష్ నాయక్, జిల్లా నాయకులు, మండల నాయకులు, పట్టణ నాయకులు, డైరెక్టర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు అధికారులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించాలి

## - జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి






నల్గొండ ఆర్సీ, అక్టోబర్ 31, తరంగాలు : పెండింగ్ లో ఉన్న వివిధ దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి రెవిన్యూ అధికారులను ఆదేశించారు.శుక్రవారం ఆమె కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో రెవిన్యూ అధికారుల తో రెవెన్యూ అంశాల పై సమీక్షించారు. పెండింగ్ లో ఉన్న భూ రికార్డులు, భూ భారతి, భూ వివాదల దరఖాస్తుల పరిష్కారానికి సంబంధించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతిమండలంలో పెండింగ్ ఫిర్యాదులను వారానికి ఒకసారి సమీక్షించాలని ,భూ సంబంధ వ్యవహారాల లో పారదర్శకతకు ప్రాధ్యనత ఇవ్వాలని, ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని చెప్పారు.సాదా బై నామల పై వచ్చిన ఫిర్యాదులను సైతం జాప్యం లేకుండా పరిష్కరించాలని చెప్పారు. అసైన్డ్ భూముల విషయంలో పెండింగ్ సమస్యలు త్వరగా పరిష్కరించాలని, రెవిన్యూ అధికారులందరూ అంకిత భావం తో, చిత్త శుద్ధితో పెండింగ్ పనులను పూర్తి చేయాలని కోరారు. మొంథా తుఫాను సందర్భంగా భారీ వర్షాలతో చుట్టూ వరద నీరు చేరిన దేవరకొండ మండలం, కొమ్మేపల్లి ఎస్ టి గురుకుల పాఠశాల విద్యార్థులను సురక్షిత ప్రాంతానికి తరలించిన మండల ,డివిజన్ రెవెన్యూ అధికారులను ఆమె అభినందించారు. అదనపు కలెక్టర్. జె శ్రీనివాస్, స్థానిక సంస్థలు ఇంచార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, నల్గొండ ఆర్డీవో వై.అశోక్ రెడ్డి, దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి, చండూరు ఆర్డీవో శ్రీదేవి, తహశీల్దార్లు ఉన్నారు.

# నవీన్ యాదవ్ గెలుపు నల్లేరుమీద నడకే..

## - పాలేరు యువజన కాంగ్రెస్ నాయకులు చెన్ను వెంకటరమణయాదవ్



పాలేరు ఆర్సీ,31 అక్టోబర్ (తరంగాలు) జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు నల్లేరు పై నడకేనని పాలేరు యువజన కాంగ్రెస్ నాయకులు చెన్ను వెంకటరమణ యాదవ్ అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని బొరబండ, ఎర్రగడ్డ, యూసఫ్ గూడ, వెంగళరావు నగర్, ఓం నగర్ తదితర ప్రాంతాల్లో నవీన్ యాదవ్ గెలుపు కోసం శుక్రవారం విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూబ్లీహిల్స్ అభివృద్ధికి నవీన్ యాదవ్ గెలుపు చాలా అవసరం ఉందని తెలిపారు. మూడు దఫాలుగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఉన్నా అభివృద్ధి మాత్రం జరుగలేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాత ప్రభుత్వమని, అందుకే ఉచిత బియ్యం, మహిళలకి ఉచిత బస్ ప్రయాణం, 500 కే గ్యాస్, ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలు లోపా-యకారి ఒప్పందం కుదుర్చుకుని అనైతిక పొత్తుకు తెరలేపారని, అయినప్పటికీ నవీన్ యాదవ్ గెలుపును ఎవరూ ఆపలేరని ధీమా వ్యక్తం చేశారు. ప్రచారంలో భాగంగా సీఎం రేవంత్ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరిస్తూ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేకల మల్లిబాబుయాదవ్, పల్లెబోయిన శ్రీను, పార్టీ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

# సూచిక బోర్డులకు అడ్డుగా ఉన్న చెట్లు తొలగింపు





- ❖ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు తన సొంత ఖర్చులతో చెట్లు తొలిగించిన ఓబిసి జిల్లా ప్రధాన కార్యదర్శి నాంపెల్లి యాదగిరి
- ❖ అభినందించిన ఎస్ఐలు సాయిబాబు,రాజు

వర్ధన్నపేట ప్రతినిధి, అక్టోబర్ 31, తరంగాలు : వర్ధన్నపేట మండలం ఉప్పరపల్లి క్రాస్ రోడ్ వద్ద ఏపుగా పెరిగిన చెట్లు ప్రయాణానికి అడ్డుగా ఉన్నాయి. ఫలితంగా తరుచు రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. రహదారి వెంట రోడ్డుకు ఏపుగా పెరిగిన చెట్లతో ఉప్పరపల్లి గ్రామం నుండి వచ్చే వాహనాలు జాతీయ రహదారి నుండి వెళ్తున్న వాహనదారులకు కనబడకపోవడం తో ప్రమాదాలు జరుగుతున్నాయి.

వరంగల్ ఖమ్మం జాతీయ రహదారి ఉప్పరపల్లి క్రాస్ రోడ్ వద్ద ఇటీవల కారు ప్రమాదంలో మహిళ మృతి చెందింది.అదేవిధంగా చాలా మంది వాహనదారులు ప్రమాదాలకు గురై గాయాల పాలవుతున్నారు. దింతో ఉప్పరపల్లి క్రాస్ రోడ్ వద్ద ఉన్న సూచిక బోర్డులకు అడ్డుగా ఉన్న చెట్లతో పాటు రహదారి పైకి వచ్చిన చెట్టు కొమ్మలను వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు ఆదేశాల మేరకు ఓబిసి జిల్లా కార్యదర్శి నాంపల్లి యాదగిరి ఆధ్వర్యంలో జెసిబి సహాయంతో వర్ధన్నపేట ఎస్సైలు సాయి బాబు, మేరుగు రాజు తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాదాలు జరగకుండా సొంత ఖర్చులతో చెట్లు తొలగించేందుకు సహాయం చేసిన ఉప్పరపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి నాంపల్లి యాదగిరిని అభినందించారు.ఉప్పరపల్లి క్రాస్ వద్ద ఏర్పాటు చేసిన సూచిక బోర్డులు కనిపించకపోవడంతో జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగించినట్లు ఎస్సై సాయిబాబు తెలిపారు.దీంతో రహదారి ఎప్పటిలాగా విశాలంగా మారడంతో పాటు దారి కనబడకుండా అడ్డంకిగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించడంతో వాహనదారులు, పాదాచారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు శ్రీపాది సతీష్, ఉప్పరపల్లి కాంగ్రెస్ నాయకులు దాడి రాజు, మహమ్మద్ వలి, తదితరులు పాల్గొన్నారు.















# సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతం - ఎం.ఎ.అజీజ్

- ❖ రాష్ట్ర మంత్రిగా మహమ్మద్ అజారుద్దీన్ ఎంపికపై హర్షం
- ❖ మైనార్టీల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి
- ❖ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి,ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క కి, రాష్ట్ర మంత్రులకు కృతజ్ఞతలు



కల్వకుర్తి, అక్టోబర్ 31, తరంగాలు ప్రతినిధి : సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతం అని, ఎం. ఏ.అజీజ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ క్యాబినెట్ లోకి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహమ్మద్ అజారుద్దీన్ ని మంత్రిగా నియమించడం ముస్లిం మైనార్టీలకు శుభ సూచకమని వేల్జాల్ మాజీ ఉపసర్పంచ్ అజీజ్ హర్షం ప్రకటించారు .. మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందనీ తెలిపారు.కాంగ్రెస్ పార్టీ మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉందని చెప్పడానికి ఈ నిర్ణయం ఒక నిదర్శనం అని ఆయన అన్నారు. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 5శాతం రిజర్వేషన్లతో ఎంతో మేలు చేశారని తెలిపారు.మైనార్టీలకు అన్ని వర్గాలతో సమానంగా అన్ని సంక్షేమ పథకాలు వారికి గౌరవ, సముచిత స్థానం లభించే విధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. మైనార్టీల కార్పొరేషన్ ద్వారా ఎన్నో రుణాలు అదేవిధంగా స్వయం ఉపాధికి చేయూత లాంటికార్యక్రమాలుచేపట్టడంతో పాటు రాజకీయంగా వారికి అనేక అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. అజారుద్దీన్ మంత్రిగా నియమించడం మైనార్టీలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి నిరూపిస్తుందని అన్నారు. కేంద్రంలో రాహుల్ గాంధీ నాయకత్వంలో అదేవిధంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో మైనార్టీలకు రాజకీయ ప్రాధాన్యత సముచిత న్యాయం జరుగుతుందని అన్నారు. ముస్లిం మైనార్టీలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లవేళలా అండగా నిలుస్తుందని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు పూర్తి రాజకీయ అభివృద్ధి దిశగా భరోసా ఇస్తుందని అన్నారు. . అజారుద్దీన్ మంత్రిగా క్యాబినెట్ లోకి రావడం మైనార్టీలకు కొండంత అండగా నిలుస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం సర్వతో ముఖాభివృద్ధి చెందుతుందని అన్నారు.

# ట్రస్మా మండల అధ్యక్షుడు కమ్మగాని కృష్ణమూర్తి కి సన్మానం

## మహబూబాబాద్ జిల్లా ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ తరుపున సన్మానం



మహబూబాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 31, తరంగాలు : మహబూబాబాద్ జిల్లా ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ గాదె రుక్మారెడ్డి డైరెక్టర్ మరియు ప్రిన్సిపాల్ ను మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించింది. ఇటీవల మహబూబాబాద్ జిల్లా ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ మండల అధ్యక్షుడిగా ఎన్నికైనందుకు ఆయనను మహబూబాబాద్ డిస్ట్రిక్ట్ ప్రైవేట్ టీచర్స్ యూనియన్ సత్కరించింది. యూనియన్ అధ్యక్షుడు గండు మురళి మాట్లాడుతూ ఎల్లవేళల మాకు మా యూనియన్కు మా ఉపాధ్యాయులకు అండగా ఉండాలని వారి సమస్యలను మీ సమస్యలుగా భావించి ఎలాంటి పక్షపాతాలు లేకుండా ఉపాధ్యాయులకు సమాజంలో గౌరవం పొందేలా చూసుకోవాలని కోరారు .ప్రైవేట్ ఉపాధ్యాయులు బాగుంటేనే పాఠశాలలు, విద్యార్థులు బాగుంటారని చెప్పారు. ఈ సమావేశంలో మహబూబాబాద్ డిస్ట్రిక్ట్ ప్రైవేట్ టీచర్స్ యూనియన్ ఉపాధ్యక్షులు సొల్లేటి వెంకన్న మరియు బోధు ప్రవీణ్, కోశాధికారి మాశెట్టి రాంబాబు, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు వినోద్ రఘు, శేఖర్, కిషన్, సువర్ణ పాల్గొన్నారు.

# కొనసాగుతున్న వ్యాధినివారణ టీకాల కార్యక్రమం



పాలేరు ఆర్సీ,31 అక్టోబర్ (తరంగాలు) ప్రభుత్వం పశుసంపదకు వచ్చే సీజన్ వ్యాధుల నివారణకోసం ప్రస్తుతం గాలికుంటువ్యాధి నివారణ టీకాల కార్యక్రమం మండలవ్యాప్తంగా ముమ్మరంగా కొనసాగుతుందని కూస-ుమంచి మండల ప్రాథమిక పశువైద్యశాల వైద్యాధికారి ఆర్ నీలకాంత్ అన్నారు. శుక్రవారం మండలంలోని రాజుపేట గ్రామంలో పశువులకు వ్యాధినివారణ టీకాలు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలోని 27 తెల్ల పశు వులకు, 487నల్ల జాతి పశువులకు టీకాలు వేయడం జరిగిందని వైద్యాధికారి నీలకాంత్ తెలిపారు. మొత్తంగా 63మంది రైతులకు లబ్ధిచేకూరినట్లు ఆయన తెలిపారు. రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆర్.నీలకాంత్ (కూసుమంచి పశువైద్యాధికారి), కే స్వరూప (జక్కేపల్లి జేవీవో), పీ.శ్రీనివాసరావు (పాలేరు ఎల్ఎస్ఏ), మహ్మద్ హమీద్ పాషా (ఈశ్వరమధారం ఎల్ఎస్ఏ), ఏ. స్వరూప (కూసుమంచి ఓఎస్), సీహెచ్ మాధవ్ (సీవోఎస్) మున్నగు పశువైద్య సిబ్బంది, గోపాలమిత్రులు పీ గోపి (పెరికాసింగారం జీఎంసీ), బీ. భాస్కర్ రెడ్డి (మల్లాయిగూడెం జీఎంసీ) %ు% కే లక్ష్మారెడ్డి (నాయకన్ గూడెం జీఎంసీ) పాల్గొన్నారు.

# సీఎం కు స్వాగతం పలికిన వరంగల్ జిల్లా యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు బిర్రు రాజు

- ● వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



వరంగల్ ప్రతినిధి, అక్టోబర్ 31,తరంగాలు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించేందుకు వచ్చిన సీఎం రేవంత్ రెడ్డికి వరంగల్ జిల్లా యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు బిర్రు రాజు ఘన స్వాగతం పలికారు.మొంథా తుఫాన్ ప్రభావంతో ఇటీవల భారీ వర్షాలు, వరదలతో తీవ్రంగా దెబ్బతిన్న హన్మకొండ పట్టణ పరిసర ప్రాంతాలను తెలంగాణ రాష్ట్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ తో పాటు ఎంపీలు ఎమ్మెల్సీలు ఎమ్మెల్యేలతో కలిసి వరంగల్ జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు బిర్రు రాజు పాల్గొన్నారు.

# రక్తదానం చేసి ప్రాణధాతలు కావాలి - ఖమ్మం సిపి సునీల్ దత్

## - పోలీసుల ఆధ్వర్యంలో మెగా రక్త దాన శిబిరం








పాలేరు ఆర్సీ, 31అక్టోబర్, (తరంగాలు) : రక్తానికి కులం,మతం లేదని మానవత్వమున్న స్త్రీ, పురుషులు ఎవ్వరైనా రక్తదానం చేయడానికి అర్హులేనని రక్తదానం చేయడం ద్వారా మరొకరి ప్రాణాన్ని కాపాడవచ్చని ఖమ్మం సిపి సునీల్ దత్ అన్నారు.పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఖమ్మం రూరల్ పోలీస్ సబ్ డివిజన్ వారి ఆధ్వర్యంలో నేలకొండపల్లి మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్ ఆవరణలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని శుక్రవా(లం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రక్తపు బొట్టు విలువైనదని,రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయలేమని,ఎవరో ఒకరు దానం%శ్రీ% చేయడం వల్లే పొందవచ్చని తెలిపారు.బ్లడ్ బ్యాంకుల్లో రక్తం నిలువలు లేక తలసేమియా,సికిల్ సెల్,డెంగ్యూ,గర్భిణీలు,రోడ్డు ప్రమాద బాధితులకి సమయానికి రక్తం అందక ప్రాణాలు కోల్పోతున్నారని,మనం ఇచ్చే కొద్దిపాటి రక్తం ఎంతో మంది అభాగ్యులు జీవితాల్లో వెలుగు నింపుతుందని వెల్లడించారు.రక్తం ఇస్తే బలహీనమైపోతామేమోనన్న అపోహను వీడి రక్తదానం చేసి ప్రాణ దాతలుగా నిలవాలని సునీల్ దత్ కోరారు. మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయం ఇంచార్జీ తుంబూరు దయాకర్ రెడ్డి రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు.కారేపల్లి, కామేపల్లి, కూస-ుమంచి, ముదిగొండ, తిరుమలాయపాలెం, రూరల్, నేలకొండపల్లి మండలాల నుండి సుమారుగా 1300 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి సీఐ సంజీవ్, ముదిగొండ సీఐ ఓ.మురళి, ఎస్సైలు పి.సంతోష్, కూచిపూడి జగదీష్, నాగరాజు, పోలీస్ సిబ్బంది, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# శ్రీ భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ పోరిక బలరాం నాయక్,

## ప్రముఖ తెలుగు సినీ దర్శకులు వంగ సందీప్ రెడ్డి





వరంగల్ ప్రతినిధి, అక్టోబర్ 31,తరంగాలు శ్రీ భద్రకాళీ దేవస్థానాన్ని పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్,ప్రముఖ తెలుగు సినీ దర్శకులు వంగ సందీప్ రెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారని దేవాలయ కార్యనిర్వహణాధికారి,సహాయ కమీషనర్ రామల సునీత తెలిపారు. పూజానంతరం సందీప్ రెడ్డికి శ్రీ భద్రకాళి శేషు మహదాశీర్వచనం నిర్వహించి ధర్మకర్తలు అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించి అమ్మవారి శేషవస్త్రములు బహూకరించి ప్రసాదములు అందజేశారు.సాయంకాలం కార్తీక దీపోత్సవం కార్యక్రమంలో భాగంగా భక్తులు దీపారాధన నిర్వహించారు. మరియు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. దేవస్థానానికి విచ్చేసిన ముత్తైదువులకు వాయినాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో దేవాలయ ధర్మకర్తలు తొనువునూరి వీరన్న, మయూరిరామేశ్వర్రావులు తదితరులు ఉన్నారు.





# సదర్ సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ



నల్గొండ ఆర్సి, అక్టోబర్ 31, తరంగాలు : నల్లగొండ జిల్లా కేంద్రంలోని నవంబర్ 2 ఆదివారం ఎన్జీ కాలేజ్ మైదానంలో యాదవుల సదర్ ఉత్సవ సమితి అధ్యక్షులు మద్ది శ్రీనివాస్ యాదవ్ అధ్వర్యంలో యాదవుల సదర్ సమ్మేళనం నిర్వహిస్తున్న సందర్భంగా యాదవ సంఘం గౌరవ పెద్దలతో కలిసి గాంధీనగర్ యాదవసంఘం భవన్ లో పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందంగా అలంకరించిన దున్నపోతులతో యువకులు కుస్తీ ఆడటం ఈ పండుగలో ముఖ్యమైన ఆచారం. యాదవ సోదరులు అందరూ ఐక్యమత్యంగా అన్ని నియోజక వర్గాల నుండి అత్యధిక సంఖ్యలో కుల మతాలకతీతంగా, పార్టీలకతీతంగా భారీగా తరలివచ్చి సదర్ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ఈ సదర్ ఉత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా హర్యానా నుండి తెప్పించిన దున్నరాజులు పద్మశ్రీ అవార్డు గెలుచుకున్న గోల్ టూ భజరంగి, షేహంష, కోహినూర్ దున్న రాజులు ప్రత్యేక ఆకర్షణంగా ఉండనున్నాయి. ఈ కార్యక్రమం లో యాదవ సంఘం ట్రస్ట్ చైర్మన్ చీర పంకజ్ యాదవ్, ట్రస్టు సలహాదారులు గుండెబోయిన లింగయ్య యాదవ్, అఖిల భారత యాదవ సంఘం నల్గొండ జిల్లా అధ్యక్షులు ముచ్చర్ల ఏడుకొండలు యాదవ్, బీజేపీ రాష్ట్ర నాయకులు పిల్లి రామరాజు యాదవ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు అల్లి సుభాష్ యాదవ్,అల్లి చంద్రయ్య యాదవ్, చల్లా కోటేష్ యాదవ్, నాగరాజు యాదవ్,సుంకరబోయిన శివ యాదవ్, గుండెబోయిన రఘు యాదవ్, కుంటిగొర్ల లింగయ్య యాదవ్, బొడ్డు సాయి యాదవ్,మొదాల రాంబాబు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# దేశ సమగ్రత,ఐక్యత కోసం కృషి చేసిన గొప్ప దేశ భక్తుడు సర్దార్ వల్లభాయి పటేల్

## - జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్




నల్గొండ ఆర్సి, అక్టోబర్ 31, తరంగాలు : జాతీయ ఐక్యత దినోత్సవం ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయి పటేల్ 150 వ జయంతి సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రన్ పర్ యూనిటీ కార్యక్రమంలో బాగంగా 2కె రన్ కార్యక్రమం పట్టణ కేంద్రంలోని యన్.జి కళాశాల నుంచి క్లాక్ టవర్ వరకు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ జెండా ఊపి ప్రారంభించి, పోలీస్ అధికారులు, సిబ్బంది,స్థానిక యువత, విద్యార్థిని విద్యార్థులు,ఇతర అధికారులు దాదాపు 500 మందితో కలిసి దేశ సమైక్యతను ప్రతిబంబించేలా ఉత్సాహంగా ఈ పరుగులో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ, సర్దార్ పటేల్ చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించి మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్ర పోరాటంలో కీలక పాత్ర పోషించి, 550 కి పైగా సంస్థానాలను భారత దేశంలో విలీనం చేయుటకు దృడ సంకల్పంతో ఏలాంటి వత్తిడికి లొంగకుండా కీలక పాత్ర పోషించిన గొప్ప వ్యక్తి సర్దార్ వల్లభాయి పటేల్ అన్నారు. అతని150 వ జయంతి సందర్భంగా మనందరం ఆయన ఆశయాలను గుర్తు చేసుకుంటూ దేశ సమగ్రత, ఐక్యత దేశ భక్తితో కలిసి ఉంటూ దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలని అన్నారు.అనంతరం జాతీయ ఐక్యత దినోత్సవ ప్రతిజ్ఞ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్,నల్లగొండ డిఎస్పి శివరాంరెడ్డి, ఏఆర్ డిఎస్పి శ్రీనివాసులు, సిఐలు రాజశేఖర్ రెడ్డి,మహా లక్ష్మయ్య, జితేందర్ రెడ్డి, శ్రీను నాయక్,రఘువీర్ రెడ్డి ఆర్ ఐ లు సంతోష్, శ్రీను,సూరప్ప నాయుదు, హరిబాబు ఎస్సైలు సైదులు, గోపాల్ రావు,మరియు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నష్టపోయిన పంట పొలాలను పరిశీలించిన టిఆర్ఎస్ నాయకులు





వర్ధన్నపేట ప్రతినిధి, అక్టోబర్ 31, తరంగాలు వర్ధన్నపేట మండలంలోని గ్రామాలలో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంటలు భారీగా నష్టం కలుగగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఆధ్వర్యంలో నష్టపోయిన పంట పొలాలను బిఆర్ఎస్ నాయకులు పరిశీలించారు. అనంతరం తాహసిల్దార్ విజయ సాగర్ కు మెమోరాండం సమర్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నష్టపోయిన ప్రతి ఎకరాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి ప్రతి రైతుకు ఎకరాకు 25 వేల రూపాయలు నష్టపరిహారం తక్షణమే అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు తూళ్ళ కుమారస్వామి,పట్టణ అధ్యక్షులు గోధుమల.మధు సుదన్,మాజీ జెడ్పిటిసి మార్గం బిక్షపతి,మాజీ ఆత్మ చైర్మన్ గుజ్జ.గోపాల్ రావు,మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్మండ్ల.యెలెందేర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ దుగ్యాల మాధవరావు, మారిపట్ల సురేష్, మాజీ సర్పంచ్ పొనుగొటి భాస్కర్ రావు, పెంచాల కుమార స్వామి, మాజీ దేవస్థానం చైర్మన్ ఎరుగొండ వేణుగోపాలరావు, మండల యూత్ చందర్ రావు, కౌన్సిలర్ శ్రీను, గ్రామ అధ్యక్షులు మంద నరసయ్య, ఉప్పలయ్య, తిరుపతి. సురేష్, చిట్యారి శ్యామ్, సాయన్న, సురేష్, నవీన్, కృష్ణ, పిట్టల రాజు, ఎండ్.రహీం, సందీప్, వీరేందర్, వీరన్న, బాబు పాల్గొన్నారు.

# దేశ సమైక్యత కోసం పాటుపడిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్

## - వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు




వరంగల్ ప్రతినిధి, అక్టోబర్ 31,తరంగాలు : దేశ సమైక్యత కోసం పాటుపడిన ఉక్కు మనిషి సర్దార్ పటేల్ అని వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 వ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా"రన్ ఫర్ యూనిటీ"కార్యక్రమంలో భాగంగా వరంగల్ తూర్పు నియోజకవర్గంలోనీ పోచం మైదాన్ నుండి వెంకటరమణ థియేటర్ వరకు రన్ ఫర్ యూనిటి కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు పాల్గొన్నారు.150 వ జయంతిని పురస్కరించుకొని వారికి మా ఘన నివాళులు అర్పించారు.అనంతరం సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి పాలాభిషేకం చేసి ఆయన దేశం కోసం చేసిన సేవలను గుర్తుచేశారు.ఈ సందర్భంగా ప్రదీప్ రావు మాట్లాడుతూ నిజాం మెడలు వంచి, రజాకార్లను తరిమికొట్టి, స్వతంత్ర భారతదేశంలో తెలంగాణను ఐక్యం చేసిన ధీరోద్ధాత్తుడు, భారతదేశ తొలి హెూం మంత్రి, మాజీ ఉపప్రధాని, ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని అన్నారు.ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధ్యక్షులు గంటా రవికుమార్, సర్దార్150 ప్రోగ్రాం కన్వీనర్ ఎరుకుల రఘునారెడ్డి, ఎర్రగొల్ల భరత్ వీర్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, వన్నాల వెంకటరమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, బిజెపి సీనియర్ నాయకులు సముద్రాల పరమేశ్వర్, జిల్లా ఉపాధ్యక్షులు కనుకుంట్ల రంజిత్ కుమార్, గడల కుమార్, జిల్లా కోశాధికారి కూచన క్రాంతి కుమార్, జిల్లా ఓబీసీ అధ్యక్షులు కందిమల్ల మహేష్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు బైరి నాగరాజు, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మదాసు రాజు మరియు నాయకులు, బీజేవైఎం కార్యకర్తలు పాల్గొన్నారు.



# మాజీ ప్రధాని,ఉప ప్రధాని చిత్రపటాలకు నివాళి

**వర్ధన్నపేటలో ఘనంగా మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి,మాజీ ఉప ప్రధాని సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతి వేడుకలు**





వర్ధన్నపేట ప్రతినిధి, అక్టోబర్ 31, తరంగాలు : వర్ధన్నపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్య నారాయణ అధ్వర్యంలో మాజీ ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ వర్ధంతి మరియు మాజీ ఉప ప్రధాని,మాజీ హోం శాఖ మంత్రి సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ మహనీయుల చిత్ర పటాలకు మండల అధ్యక్షుడు ఎద్దు సత్య నారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజ్ రెడ్డి, వర్ధన్నపేట టౌన్ ప్రసిడెంట్ మైస సురేష్,ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు, వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆపరేషన్ బ్లూ స్టార్ కారణంగా తన సిక్కు బాడీ గార్డ్ చేతిలో 1984 అక్టోబర్ 31 న ఇందిరా గాంధీ మరణించడం జరిగింది.బడుగు బలహీన వర్గాలు, దళితులతో పాటు మైనార్టీలంతా తమ అమ్మను కోల్పోయినట్టుగా బాధపడ్డారు .దేశాన్ని సమున్నతంగా నిలబెట్టిన దివంగత ప్రధాని ఇందిర చిరస్మరణీయురాలు. 1966 లో ఇందిరా గాంధీ ప్రధాన మంత్రి అయిన నాటికి దేశములో ఆర్థిక మాంద్యం,పారిశ్రామిక ఉత్పత్తుల పతనం,ఎగుమతులు తగ్గడం,ఆహార ధాన్యాల సంక్షోభం ఏర్పడ్డాయి. వీటితో పాటు బడ్జెట్ దేపిసిట్ పెరగడం,విదేశీ ఆర్థిక సాయంపై ఎక్కువగా ఆధారపడటం వంటివే గాక 1962,1965 నాటి యుద్ధాలు, పాకిస్థాన్,చైనా కూటమి ఏర్పాటులో సైన్యం పై ఖర్చు పెంచడం వంటివి జరిగాయి వర్షాలు లేక కరువు ఏర్పడింది.ధరలు పెరిగాయి,పాలన ఖర్చులు తగ్గించుకోవడం వీలుపడలేదు అయినా యుద్ధ ప్రాతిపదికన ఆహార ధాన్యాలు సేకరించి ప్రజలకు పంచి, వారి ప్రాణాలను కాపాడగలిగారని కొనియాడారు. నిజాం మెడలు వంచి హైద్రాబాద్ సంస్థానాన్ని విముక్తం చేయడంతో పాటు 550 కి పైగా ,సంస్థానాలను దేశంలో విలీనం చేసిన ఉక్కు మనిషి సర్దార్ పటేల్ అని అన్నారు. 1948 సెప్టెంబర్ 13 న ఆపరేషన్ పోలో కింద భారత సైన్యం మేజర్ జనరల్ జె.ఎస్.చౌదరి నాయకత్వంలో వేగంగా హైదరాబాద్ వైపునకు మళ్ళింది నిజాం సైన్యం కనీసం పోరాటాన్ని కూడా చూపలేదు కేవలం నాలుగు రోజుల్లో నిజాం ఓటమిని ఒప్పుకొని లొంగిపోయారు. హైద్రాబాద్ రాష్ట్రాన్ని భారత్ లో పటేల్ విలీనం చేయించిన ధీరాశాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు పోశాల వెంకన్న గౌడ్, కాంగ్రెస్ పార్టీ మహిళా మండల అధ్యక్షురాలు మరుపట్ల అరుణ, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు కుల్ల యాకంతం, ఐనవోలు టెంపుల్ డైరెక్టర్ గుం టి కుమార స్వామి, భీమా నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బచ్చు గంగా ధర రావు, అంగోత్ నాను నాయక్, మాజీ కౌన్సిలర్లు సమ్మెట సుధీర్, తుమ్మల రవీందర్, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాంపెల్లి యాదగిరి, ల్యాబర్తి, కొత్తపెల్లి, అంబేద్కర్ నగర్, ఇల్లంద గ్రామ పార్టీ ల అధ్యక్షులు చిదుముల్ల భాస్కర్, తాళ్ళపెల్లి యాదగిరి గౌడ్, సింగపురం ఎలియాస్, ఎద్దు రాజేంద్ర ప్రసాద్, మహిళా నాయకురాండ్లు పాక సుజాత, లింగం రజిత రెడ్డి, పెద్దబోయిన ఉపేంద్ర, గడ్డం సమ్మయ్య, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మల్లెపాక సమ్మయ్య, కర్ర శ్రీనివాస్ రెడ్డి, మరుపట్ల సాయికుమార్, దికొండ ఉపేందర్, గంగరాజు, లింగా రాజు, జోగు పరిశారములు, చిటూరి రాజు, భూక్యా మల్లు నాయక్, ఐత సుధాకర్, తుమ్మల కుమారస్వామి, మంద భాస్కర్, దొణికల మధు గౌడ్, బచ్చల స్వామి, తదితరులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణనే ప్రధాన ధ్యేయం

## - రన్ ఫర్ యూనిటీ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మహేందర్



తరంగాలు, మెదక్, అక్టోబర్ 31 : శాంతిభద్రతల పరిరక్షణనే తమ ప్రధాన ధ్యేయమని మెదక్ అదనపు ఎస్పీ మహేందర్ అన్నారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని జాతీయ ఐక్యత దినోత్సవ (అక్టోబర్ 31) వేడుకలను శుక్రవారం మెదక్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా మెదక్ పట్టణంలో ఉదయం ధ్యాన్ చంద్ చౌరస్తా నుండి రామదాసు చౌరస్తా 2 కె రన్ నిర్వహించారు. సుమారు 300 మంది స్థానిక యువత, విద్యార్థులు, పోలీసులు పాల్గొన్న ఈ పరుగు కార్యక్రమాన్ని మెదక్ అదనపు ఎస్పీ మహేందర్ పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్న ప్రతి ఒక్కరికి అభినందనలు తెలియజేశారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల ధన-మాన-ప్రాణ రక్షణ కోసం పోలీస్ యంత్రాంగం అహర్నిశలు కృషి చేస్తుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ డియస్పి ప్రసన్న కుమార్, ఏఆర్ డియస్పి రంగా నాయక్, సీఐ లు సందీప్ రెడ్డి, కృష్ణ మూర్తి, మహేష్, రాజా శేఖర్ రెడ్డి, జర్జ్ శైలందర్, ఎసైలు, సిబ్బంది, విద్యార్థులు భారీగా పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఇంటింటి ప్రచారంలో..

# మెదక్ అసెంబ్లీ ఇంచార్జ్ కంటారెడ్డి తిరుపతి రెడ్డి



తరంగాలు, మెదక్, అక్టోబర్ 31 : హైదరాబాద్ జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలలో బి ఆర్ యస్ పార్టీ నాయకులు నియోజకవర్గంలోని ఫెజ్ -2 లో బూత్ నెంబర్ - 84, 364 లలో బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతా గోపినాథ్ కు మద్దతుగా బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మెదక్ అసెంబ్లీ నియోజకవర్గం ఇంచార్జ్ కంటారెడ్డి తిరుపతిరెడ్డి, కార్పొరేటర్ మందాటి శ్రీనివాసరావు లు శుక్రవారం ఇంటింటా ఎన్నికల ప్రచారం చేపట్టారు. స్థానికంగా ఉన్న హోటళ్లలో స్థానిక ఓటర్లతో చాయ్ తాగుతూ కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా కంటారెడ్డి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ప్రచారంలో భాగంగా ఇంటింటికి ప్రచారం కు వెళ్తున్న మాకు ఓటర్లు ఘన స్వాగతం పలుకుతున్నారని తెలిపారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి సునీతా గోపీనాథ్ గెలుపు ఖాయమని, మేమంతా కారు గుర్తుకే ఓటు వేస్తామని ఓటర్లు బహిరంగంగానే చర్చించుకుంటున్నట్లు కంటారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ నాయకుల తో పాటు మెదక్ నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# ప్రతి నెలా చివరి శుక్రవారం పట్టణంలోని శ్రీ కాళిక దేవి ఆలయం లో అన్న దాన కార్యక్రమం

## ఈ నెల శుక్రవారం అన్నదాత కరాటే నగేష్ చారి (సాంస్కృతిక కార్యదర్శి)






తరంగాలు, మెదక్, అక్టోబర్ 31 : పట్టణంలో శ్రీ కాళికా దేవి అమ్మవారి ఆలయం లో పట్టణ స్వర్ణ కార సంఘం ఆధ్వర్యంలో ప్రతి నెల చివరి శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. అందులో బాగంగా ఈ నెల శుక్రవారం కరాటే నగేష్ చారి తనకు తాను స్వచ్చందంగా ముందుకు వచ్చి అన్న దాన కార్యక్రమం నిర్వహించారు మధ్యాహ్నం ఒంటిగంట నుండి మూడు గంటల వరకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని స్వర్ణకారులే కాకుండా ఇతర ప్రాంతాల నుండి వారి వారి పనుల కోసం మెదక్ పట్టణం కు వచ్చిన వారికి పట్టెడన్నం పెట్టడానికి తలచిన మహా కార్యం రోజు రోజుకు విజయ వంతంగా కొనసాగుతోందని, అన్నదాన చేస్తున్న స్వర్ణ కార సంఘం నిర్ణయం తీసుకోవడం పట్ల పలువురు అభినందిస్తున్నారు. ఆకలితో వచ్చిన వారికి ఆకలి తీర్చడంలో నాణ్యతమైన భోజనం అందించడంలో స్వర్ణ కార సంఘం సఫలీకృతం అయింది. ఇది విజయవంతంగా ముందుకు తీసుకు పోతున్న యువజన సంఘం ప్రోత్సాహం అద్భుతంగా ఉంది. ఈ కార్యక్రమం మరింత విజయవంతంగా ముందుకు కొనసాగాలని పలువురు కోరుతున్నారు.

# దాతృత్వం చాటుకున్న ఈ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్



తరంగాలు, యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 31: సంస్థాన్ నారాయణపురం గ్రామానికి చెందిన వడ్డేపల్లి లింగమ్మ, కంకణాలగూడెం గ్రామనికి చెందిన సిరిపంగి నర్సమ్మ వీరు ఇద్దరు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయం ఈ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్ కు తెలియజేయడం జరిగింది. వెంటనే స్పందించి ఇద్దరికీ నెల రోజులు సరిపడా మందులు ఇప్పించడం జరిగింది. ఈ యొక్క మెడిసిన్ ను ఫౌండేషన్ సభ్యులు వారికి అందజేశారు . ఈ కార్యక్రమంలో ఈ ఎల్ వి ఫౌండేషన్ సభ్యులు బండమీది కిరణ్, ఓర్సు విజయ్ ఎలిజల శ్రీను పట్నం బాలకృష్ణ, మహేష్, జనగాం సతీష్, శంకర్, బద్దం రాజు, కడారి రాకేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వివాహ వేడుకల్లో పాల్గొని నవ దంపతులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి



తరంగాలు, మెదక్, అక్టోబర్ 31: మెదక్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్ వనజల కుమారుడు రాగి సుమంత్ వివాహం సుప్రియా తో శుక్రవారం హైదరాబాద్ సప్త కన్వెన్షన్లో ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే, మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు పద్మాదేవేందర్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. వీరి వెంట నాయకులు లింగ రెడ్డి, జుబెర్ అహ్మద్, మోహన్ నాయక్ తో పాటు రాగి వారి కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.

### వివాహ వేడుకకు హాజరైన మెదక్ జిల్లా సీనియర్ జర్నలిస్టులు

మెదక్ జిల్లా మెదక్ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాగి అశోక్ వనజ ల కుమారుని వివాహం సుమంత్ సుప్రియా తో జరిగిన పెళ్లి వేడుకకు హాజరైన నూతన వధువరులను ఆశీర్వదించిన మెదక్ జిల్లా సీనియర్ జర్నలిస్టులు రిటైర్డ్ డివిజనల్ డి పి ఆర్ ఓ మంగ నాగభూషణం, శంకర్ దయాల్ చారి, యస్ నరసింహ చారి, గోపాల్ గౌడ్, శరత్ చంద్ర గౌడ్, సందీప్, అశోక్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

Printed,Published by,Owened by **GADDAM NAGARAJU &** Printed at ,arun publication ,HNO 51/1 indhiramma colony,phase 1,nizampet, Hyderabad **RNI. NO TELTEL/2022/83463 &** Published at .HNO 3-123shivanagar colony,Ellanda, Wardhannapet, warangal 506313.. telangana
**EDITOR : GADDAM NAGARAJU . CELL :9494923460 . Website : WWW.tharangalu.com Email : nagarajugaddam009@gmail.com**